# ఇంటల్లుని ఇంగితం

"మేమొచ్చి వారం రోజులైంది. సెలవు ఐపోతుంది. సాయంత్రం గోదావరిలో వెళ్తాం మావయ్యా !" పొద్దున్నే స్నానాలు ముగించి వేడి చాయ సిప్ చేస్తూ చల్లగా చెప్పేశాడు శంకర్రావు.

స్టీల్ సిటీ విశాఖలో సగటు ఉద్యోగి అతడు. అత్తారింటికి హైద్రాబాదొచ్చాడు. చూడాల్సినవన్నీ చూశాడు.

పసిప్రాయంలో గజ్జెల పట్టాగొలుసులతో గుండెల మీదాడుకున్న గారాల కూతురు హిమజ మెడలో ఆర్నెల్ల క్రితం మూడు ముళ్ళేసిన అల్లుని క్రీగంటి చూపులు కూతురు మీదున్నాయని పసికట్టిన మామగారు మెడమీద కండువా సర్దుకున్నాడు.

"దీపావళి పండక్కొచ్చారుగదా. కార్తీక పౌర్ణమి దాకా ఉంటారనుకున్నా నల్లుడూ!" అంటూ బాత్రూం వైపెళ్లారు.

జామాతా దశమగ్రహః సామెత గుర్తుకొచ్చిందేమో మామగార్కి... అనుకున్నాడు శంకర్రావు. ముసిముసి నవ్వులతో మొహాలు చూసుకుంటున్న అత్తా, బామ్మర్ది బాలేశం అతని దృష్టి కందలేదు గాని, అప్పుడే స్నానం చేసొచ్చి జడ అల్లుకుంటున్న హిమజ అంతా గ్రహించింది. ఎత్తైన గుండెలమీద పొడగాటి జడ వంపులు తిరుగుతోంది. నున్నని బుగ్గల మీద సన్నని సిగ్గులు చిందులేస్తున్నాయి. కాటుక కళ్లలో కమ్మని కాంతులు... ఒళ్లంతా పులకింతలు...

"అబ్బా ! మీకన్నీ తొందరే !" అంటూ గదిలోకి తుర్రుమంది.

"మనమలా బయటికెళ్లొద్దాం బావా !" బాలేశం ఆఫర్... శంకర్రావుని గదిలో కెళ్లనీయలేదు.

"ఇంకా ఈ మెగాసిటిలో చూసేందుకేం మిగిలిందీ ?"

"అలా లైబ్రరీ కెళ్లొద్దాం పద బావా !" లాక్కెళ్లాడు.

మంచమ్మీద కిటికీవైపు తిరిగి పడుకుంది హిమజ. పెరట్లో... పూర్ణ వికసిత ముద్దమందారమ్మీద తుమ్మెద వాలింది. చిలిపి ఊహలు పెదాల నదిలిస్తున్నాయి. అనుకోకుండా వారం క్రితం దృశ్యం.. కళ్లల్లో విష్ణు చక్రంలా కదుల్తూంటే మనసు తెరమీద మరేదో అనుమానం భూచక్రంలా తిరుగుతోంది.

... చల్లని సాయంకాలం భర్తతో దీపావళి పండక్కి పుట్టింటికి బయలు దేరుతూంటే కాకరవత్తులు వెలిగాయి. గోదావరి ఎక్స్‌ప్రెస్ విశాఖ పట్నం దాటి హైద్రాబాదు అభిముఖంగా పరుగులు తీస్తోంది. త్రీటైర్ బోగి ఉయ్యాలలా ఊగుతోంది. భర్తకు, తనకు ఎదురెదురు బెర్త్‌లు పక్కల మీద ఒరగగానే చూపులు కలుసుకుని మాట్లాడుకుంటున్నై.

సామర్లకోటలో లైట్లు వెలిగినై. పక్కపక్కన కూచుండి కిటికీలోంచి పరిసరాలు పరిశీలిస్తుంటే భుజాలు ఒరుసుకుంటున్నాయి. రాజమండ్రిలో రాత్రి భోజనం ప్రారంభ మైంది. శ్రీవారి ఎడమచెయ్యి తన సన్నని నడుమును ఒడ్డాణంగా చుట్టుకుంటోంది. ఒంటినిండా గిలిగింతలు... పులకింతలు. కాని... రైలు... వయసు పరువలంలా పరుగెడుతున్న రైలు బోగీ...

"అబ్బా ... ఆశ ! అంతా మనల్నే చూస్తారు మహానుభావా !" సిగ్గు భారాన్ని గుండెల్లో అదిమి పెట్టి చెయ్యి తొలగించింది. భోజన మయ్యాక ఎదురెదురుగా బెర్త్‌ల మీద పడుకున్నార్నమాటే గాని... నరాల్లో చిగురులు వేస్తున్న కొంటెస్వరాలు 'ఒకే బెర్త్ ఇద్దరికీ సరిపోయేదిగదా !' అంటున్నాయి.

అర్ధరాత్రి ... విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో గోదావరి అరగంట ఆగింది. ఒంటిగంట దాటుతోంది. ప్చ్ ... ఎంతసేపు మొహాలు చూసుకున్నా ఇంతేగదా !

"ప్చ్... చూపుల కోలాటం చాలిహ అటు తిరిగి పడుకోండి." అని తానూ అటు తిరిగింది. మసక వెలుతురులో మగత నిద్ర... ఆ తర్వాత కలత నిద్ర...

"వీడెవడ్రా బాబూ ! టాయిలెట్లో దూరినంక నిద్ర వస్తుందేమో ! పావు గంట దాటింది... బయటకు రాడేంది ?"

"అరె ! గింతసేపు ఒక్కడే లోపలుంటూ బయటున్నోళ్ల గతి ఏందటా ?"

"ఆపుకోవడం కష్టమైపోతుంది. జెర తలుపుగొట్టుండ్రి" తోటి ప్రయాణికుల అసహనం మాటలై వినబడ్తోంది. ఆవులించి లేచి కూచుంది. రైలు ముందు కురుకు తూంటే చెట్లూ చేమలు వెనక్కు పరుగెడుతున్నాయి. మసకచీకటి మాయమై ప్రకృతి బూడిద వర్ణమైపోతుంది.

"అరె నీయవ్వ ! ఇంగ గా మనిషి రాడా ! జెరగట్టిగ పిలువుండ్రి" అందోళనగా టాయిలెట్ తలుపు కొడ్తున్నాడొకాయన. మరో ఇద్దరు అతనికి సహాయమందిస్తున్నారు.

"ఎవరో ... విచిత్ర వ్యక్తి !..." అనుకుంటూ ఇటు తిరిగింది. ఎదురు బెర్త్ మీద శంకర్రావు లేడు. ఖాళీగా ఉంది. పై బెర్త్ నుండి దిగివచ్చిన నడివయసావిడ కొంగు సర్దుకుని "చూడమ్మా ! టాయిలెట్‌లో ఉంది మీ ఆయనే కదా" బుగ్గలు నొక్కుకుంది. చెంప చెళ్లుమన్నట్టనిపించింది. బుర్ర గిర్రుమంది. గబగబా వెళ్లి టాయిలెట్ తలుపు వాయిస్తూ "అబ్బా... బయటకు రండిహ !" గట్టిగా అరిచింది.

టాయిలెట్ డోరు తెరుచుకుంది.

"ఓర్ని..." ఇంకేదో అనబోతూ బయటికొస్తున్న శంకర్రావు నోరు అలాగే తెరుచు కునుంది. బయటి పరిస్థితి వివరించి "ఇలాగైతే ఎలాగండీ ? ఇది మన సొంతిల్లు కాదు గదా !" అంటూ టూత్‌బ్రష్ మీద పేస్టు వేసి అతని చేతికందించింది.

"ముందు మీరు మొహం కడుక్కురండి." అంది. తాను టాయ్‌లెట్ కెళ్లొచ్చాక

శంకర్రావు దంతధావనం సాగుతోంది. మూతి నిండా తెల్లని నురగ బురగలు కక్కి బయటికొస్తోంది. సీన్ అసహ్యంగా ఉంది... వాష్‌బేసిన్‌వైపు చూపించి

"మీరొచ్చేలోగా నేను పళ్లు తోముకుంటాను" అంది.

అటు శంకర్రావు వెల్తూంటే ఇటు తాను బెర్త్‌మీద కూచుండి పళ్లుతోము కుంటోంది.

... ఇంకో రెండు గంటల్లో హైద్రాబాద్ చేరుకుంటాము. అమ్మ ఎదురొచ్చి అప్యాయంగా కౌగిలించుకుంటుంది. తమ్ముడు బాలేశం బావ గారితో తమాషా చేస్తుంటాడు. నాన్న గారేమో...

గంద్ర్ర్ర్... డర్ర్ర్ .. ఆహ్హా... ఆహ్హాహ్హా... వాష్‌బేసిన్ వైపు నుండి విచిత్ర శబ్ద తరంగాలొస్తున్నాయి.

... నాన్నగారేమో 'బాగున్నారా అల్లుడు గారూ !' అంటూ ఆయన్ను పలకరిస్తారు. తన తలనిమురుతూ 'ఎన్నాళ్లైంది తల్లీ !' అంటాడు...

కణ్ కణ్ .. .ఘ్రూం.. క్రీం... ద్రర్ర్ర్ ... గర్జనలు, గాండ్రింపులు కలెగలిపిన భయంకర శబ్దాలు... పక్క బెర్త్ మీద నిద్రపోతున్న పాప ఝుడుసుకుని ఏడుపు లంకించు కుంది. ఎవరా మహానుభావులు ! మొహం కడుక్కుంటున్నారా లేక పిశాచ ధ్వన్యనుకరణ విద్య ప్రదర్శిస్తున్నారా ! తానూ మొహం కడుక్కోవాలి గదా ! వాష్ బేసిన్‌వైపు నడుస్తోంది.

ఆశ్చర్యం ! భయంకర శబ్ద సృష్టి కర్త... తన భర్తనే. పుట్టినప్పట్నించి నాలుక, గొంతు తోమక... ఇప్పుడే గొంతులో నీళ్ళు పోసుకుంటున్నట్లు ఎక్సర్‌సైజు చేస్తున్నాడు. పక్కనున్న నలుగురైదుగురు జూలో కొత్తరకం అడవిజంతువు అరుపుల్ని వింటున్నట్టు నోరెల్లబెట్టి చూస్తున్నారు.

శంకర్రావు నాలుకమీద చెయ్యేసి ఇంకా కెలుకుతూనే ఉన్నాడు. ఆ కెలుకుడు... పొత్తి కడుపులోంచి పేగుల్ని గూడా పెకలించుకొస్తుందేమో ! అతన్నేమనాలో ఎలా స్పందించాలో అర్థంగాక కాస్సేపు తానూ ఓ ప్రేక్షకురాలైంది. విచిత్ర శబ్దాలు రైలు పరుగుల శబ్దాల నదరగొడ్తున్నాయి.

"ఎవరండీ మాస్టారూ... పాప భయపడ్తుందండీ !" పాప తండ్రి పరుగెత్తు కొచ్చాడు. శంకర్రావు చెవిలోకది దూరనట్టుంది. నోట్లోకి మళ్లీ వేళ్లు దూర్చబోతున్నాడు.

తనకు అరికాలు మంట నెత్తికెక్కింది.

"ఆగండి ... ఇహచాలు" జబ్బబట్టి వెనక్కు లాగింది.

అమాయకుడిలా వెనుదిరిగి "ఏమైంది హిమా ?" తననూ పక్కనున్న జనాలను విచిత్రంగా చూస్తున్నాడు. ఒళ్లంతా గాట్లు పెట్టి కారం చల్లినట్లైంది.

"ఛీఛీ... ఏమిటి అరుపులూ ?" ధుమధుమలాడింది "ఇహ చాలు ముఖ ప్రక్షాళన." పక్కకు జరిపింది. మొహమ్మీద నీళ్ళు చల్లుకుని బెర్త్‌వైపు నడిచాడు. తానూ మొహం కడుక్కొని వస్తూంటే పాపతల్లి కోపంగా చూస్తోంది.

"మీరింత వీర అరుపులు అరుస్తారనుకోలేదు సుమా !" అవమానాన్ని భరించ లేక... కోపాన్నంతా గొంతులో దాచేసింది.

"అంత ఘోరంగా ఉందా హిమా ?" అలిగిన బాలకృష్ణుడిలా కళ్లూ చేతులు ముడుచుకుని బెర్త్ కొరిగి కూర్చున్నాడు.

"ఇంట్లో బాత్రూముంటుంది. ఇక్కడది లేదు గదా" సంజాయిషి ఇవ్వబోయాడు.

"కానీ... ఇంగితజ్ఞానం... అదే కామన్‌సెన్స్ అనేదుండాలిగదా" లోపలి కుతకుత గొంతు దాటుతోంది...

"అక్కాయ్ !" బాలేశం వచ్చి పక్కన కూచున్నాడు. "టెలిగ్రామిచ్చి రెండ్రోజుల సెలవు పొడగించుమంటే బావగారు..."

"రెండు రోజులు కాదుగదా ఇంకా రెండు గంటలు గూడా ఇక్కడుండ డానికి వీల్లేదు" దిగ్గున లేచింది. "మేం తక్షణమే బయల్దేరాలి. రాత్రి ప్రయాణం ఆయనకు పడదు..."

"ఇదేందక్కా ?" నిర్ఘాంతపోవడం బాలేశం వంతయింది. " కొండనాలిక్కి మందు వేస్తే ఉన్ననాలిక ఊడిపోయిందన్నట్టుంది."

"అదంతేరా తమ్ముడూ ! నువ్వేమీ అనుకోకు." అసలు సంగతి చెప్పలేక బట్టలు సర్దడం ప్రారంభించింది.

సెలవు పొడగించుమని సలహా ఇస్తుందనుకున్న భార్య వాలకానికి కరెంట్ షాక్ కొట్టినట్టైంది శంకర్రావుకు. తల్లిదండ్రులు, తమ్ముని సముదాయింపుల్ని పక్కన బెట్టింది హిమజ. అరగంటలో అల్పాహారం ముగించి భర్తతో బయలుదేరింది.

ఆటో రైల్వేస్టేషన్ వైపు పరుగులు తీస్తోంది.

"ఆనాడా హిమవంతుడు అల్లుడు శంకరున్ని అత్తారింటికి రావద్దన్నాడు. ఈనాడీ హిమజ భర్త శంకర్రావుని అత్తారింటి నుండి బలవంతంగా లాక్కెల్తోంది." శంకర్రావు గొణుక్కున్నాడు.

"అదికాదండీ !" భర్త భుజాని కొరిగి బుజ్జగింపుకు దిగింది. "రాత్రి గోదావరికి బయల్దేరితే... అన్నవరంలోనే తెల్లారిపోతుంది. మీ కాలకృత్యాలు... ముఖ ప్రక్షాళన... భయమేస్తోంది...."

"నీ భయం నాకర్థమైంది హిమా !" శంకర్రావు పెదాలమీద తెల్లని చిరునవ్వు మెరిసింది. "ఇక జీవితంలో కామన్ సెన్స్ గురించి మరిచిపోనని అభయమిస్తున్నాను."

ఇద్దరి నవ్వులు ఆటో పరుగుల్లో కలిసిపోయినై.

*(జలధి - 1-9-2004)*